ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755

తగ్గిన 'స్థిరాస్తి' రిజిస్ట్రేషన్ల జోరు

లక్ష్యంలో పూర్తయ్యింది 70.98శాతం మాత్రమే
మిగిలిందిక రెండు నెలలే
హైరానా పడుతున్న అధికారులు


చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల జోరు తగ్గడంతో రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యంలో ఇప్పటి వరకు 2024-25 ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 70.98శాతం మాత్రమే పూర్తయ్యింది. మిగిలిన రెండు (ఫిబ్రవరి, మార్చి) నెలల్లో 29శాతం రాబడి వస్తుందో లేదోనని అధికారులు హైరానా పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో స్థిరాస్తి వ్యాపారం కుదేలయ్యింది. మరోవైపు రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరగడం వల్ల చాలామంది ఒప్పందాలతోనే సరిపెట్టుకుంటున్నారు. అయితే ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడంతో కొంత ఆదాయం వస్తోంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా..

జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు(ఎస్ఆర్‌లు) ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని కార్యాలయాల్లో ఈసారి పెద్దగా లక్ష్యాలు నమోదు కాలేదు. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.221.88కోట్లుగా నిర్దేశించింది. జనవరినాటికి రూ.177.50కోట్ల లక్ష్యంలో రూ.125.99 కోట్లు మాత్రమే (70.98శాతం) వసూలైంది. ఎస్ఆర్‌లవారీగా.. అత్యధికంగా కార్వేటినగరంలో 81.26శాతం, పలమనేరులో 79.42 శాతం, చిత్తూరు ఆర్వోలో 73.42 శాతం కలెక్షన్లతో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో ఉన్నాయి.బంగారుపాళ్యం అతితక్కువగా 58.35శాతం మాత్రమే సాధించింది. పలు పట్టణ ప్రాంతాల్లో ప్లాట్ల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో స్థిరాస్తుల క్రయవిక్రయాలు తగ్గుతున్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు.

నిర్దేశించిన లక్ష్యం (జనవరి నెలవరకు)
సాధించిన ప్రగతి (రూ.కోట్లలో)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయ లక్ష్యం	జనవరి వరకు	రాబడి శాతం
బంగారుపాళ్యం	9.38	5.47	58.35
కుప్పం	20.55	14.25	69.37
పలమనేరు	27.02	21.46	79.42
పుంగనూరు	26.21	16.19	61.78
చిత్తూరు (ఆర్వో)	60.61	44.50	73.42
కార్వేటినగరం	7.76	6.31	81.26
నగరి	13.06	9.20	70.46
చిత్తూరు రూరల్	12.86	8.57	66.59
మొత్తం	177.50	12.59	70.98

చింటూకు బెయిల్



పదేళ్లనాటి మేయర్ దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితుడికి హైకోర్టు కండిషన్ బెయిల్

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):పదేళ్ల క్రితం నాటి చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో ప్రధాన నిందితుడైన శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.2015 నవంబరు 17వ తేదీ ఉదయం అప్పట్లో మేయర్‌గా ఉన్న కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్ చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో వుండగా దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే.సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న సమయంలో ముసుగు ధరించిన ముగ్గురు వ్యక్తులు కార్యాలయంలోకి ప్రవేశించి కఠారి అనురాధను తుపాకితో కాల్చగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పక్క ఛాంబర్‌లో ఉన్న ఆమె భర్త కఠారి మోహన్ కాల్పుల శబ్దం విని మేయర్ ఛాంబర్‌కు పరుగెత్తుకుని రాగా ఆయనపైనా విచక్షణారహితంగా కత్తులతో దాడి చేసి వెళ్లిపోయారు.తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుమారుడు కఠారి ప్రవీణ్ తదితరులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు కొన ఊపిరితో ఉన్న కఠారి మోహన్‌ను మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఆయన కూడా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించారు. ఈ జంట హత్యలకు సంబంధించి చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసులు చంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు మరో 22మందిపై కేసు నమోదు చేశారు, అనంతరం విడతల వారీగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.అప్పటికే చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై హత్యాయత్నం కేసులో బెయిల్‌పై ఉన్న చింటూ మేయర్ దంపతుల హత్య కేసులో నవంబరు 30వ తేదీన చిత్తూరు నాలుగవ కోర్టులో న్యాయమూర్తి ఎదుట లొంగిపోయాడు.న్యాయమూర్తి రిమాండ్ విధించగా అప్పటి నుంచి చిత్తూరు, కడప జైళ్లలో శిక్షను అనుభవిస్తూ వచ్చిన చింటూ ప్రస్తుతం చిత్తూరు సబ్‌జైల్లో ఉన్నారు.మొత్తం 23 మందిపై కేసు నమోదు చేయగా చింటూ, మంజునాథ్, జయప్రకాష్‌రెడ్డి మినహా 20 మందికి హైకోర్టు గతంలోనే షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.మిగిలిన ముగ్గురు నిందితులు బెయిల్ కోసం హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినా వివిధ కారణాల చేత బెయిల్ మంజూరు కాలేదు.ఈ నేపథ్యంలో చింటూకు మాత్రం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తిసుబ్బారెడ్డి పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు.చిత్తూరు 4వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌కు రూ. లక్ష చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. విచారణ నిమిత్తం 6వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో హాజరుకావాల్సి ఉన్నప్పుడు మినహా చిత్తూరు పట్టణంలోకి ప్రవేశించడానికి వీల్లేదని, ఎక్కడ ఉంటున్నది, ఫోన్ నంబర్, లైవ్ లొకేషన్ వివరాలను చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలకు అందజేయాలన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది డి.పూర్ణచంద్రారెడ్డి వాదనలు వినిపించారు. తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి నిందితుడు చింటూకు బెయిల్ మంజూరు చేస్తూ శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించారు. 'దర్యాప్తు అధికారి మినహా సాక్షుల విచారణ పూర్తయ్యింది. నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నాం.' అని న్యాయమూర్తి జస్టిస్ సత్తిసుబ్బారెడ్డి తీర్పులో పేర్కొన్నారు.

నేడు పలమనేరుకు
హైకోర్టు సీజే

- సుప్రీంకోర్టు జడ్జితో కలసి కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం


పలమనేరులో ప్రారంభించనున్న న్యాయమూర్తుల నివాస భవనాలు

పలమనేరు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని, నలుగురు జడ్జీల నివాస భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణ భట్,హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం వస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. లక్ష్మీపతి తెలిపారు. 2016వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ భవనాల నిర్మాణానికి రూ. 15.18 కోట్లు మంజూరు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో జాప్యం కావడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ భవనాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేశారు. ఈ భవనాలను శనివారం ప్రారంభిస్తారని లక్ష్మీపతి తెలిపారు. హైకోర్టు జడ్జిలు బి. కృష్ణమోహన్, మహేశ్వరరావు కుంచం, టీసీడీ శేఖర్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఫైనాన్స్ వ్యాపారిపై కత్తులతో దాడి

చిత్తూరు అర్బన్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఫైనాన్స్ వ్యాపారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు. టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. చిత్తూరు హరిజనవాడకు చెందిన మాధవన్ నగరంలో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. రోజూలాగే శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలప్పుడు ఇంటికి బయల్దేరాడు. తేనబండ విజయలక్ష్మి కాలనీ రోడ్డులో వస్తుండగా మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మాధవన్ ముఖంపై కారం చల్లి, కత్తులతో దాడి చేసి పరారయ్యారు. ఈ దాడిలో మాధవన్ చెయ్యి, భుజంపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భుజం, చెయ్యిపై మొత్తం 12 కుట్లు పడ్డాయని పోలీసులు తెలిపారు.

అంతా గోప్యమే!

- పెద్దిరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ బృందం

కల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):పులిచెర్ల మండలం మంగళంపేట సమీప అటవీ ప్రాంతంలో వున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి తదితర అధికారుల బృందం పరిశీలించింది.పెద్దిరెడ్డి భూ ఆక్రమణలపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో గత శుక్రవారం ఆ భూములున్న ప్రాంతాన్ని జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి పరిశీలించి సర్వే చేశారు కానీ వివరాలు బయటకు వెల్లడించలేదు.వారం రోజుల తరువాత రెండవసారి జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ జయసింహ, ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మరికొంత సేపటికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడారు.ఒక గంట తరువాత కలెక్టర్, ఎస్పీ వెళ్లిపోగా మధ్యాహ్న సమయానికి మిగిలిన అధికారులు అక్కడినుంచి కల్లూరు జడ్పీ బంగళాకు చేరుకున్నారు. మధ్యాహ్న భోజనం తరువాత మరోసారి వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకున్న వారు సాయంత్రం వెనుదిరిగారు. అక్కడ పరిశీలించిన అంశాలను బయటకు వెల్లడించకుండా గోప్యత పాటించారు. ఆ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే మార్గంలో సుమారు 5 కి.మీ దూరం ముందే పోలీసులు లోపలికి ఎవరినీ అనుమతించలేదు. ఆ మార్గంలో భూములున్న రైతులను సైతం వారి భూముల వద్దకు వెళ్లేందుకు ఆ మార్గంలో అనుమతించకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

హెల్మెట్ లేకుంటే నో ఎంట్రీ

● కార్మికులకు నిప్పో పరిశ్రమ నిబంధన



హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులను విధుల్లోకి అనుమతించబోమని తడ మండలంలోని నిప్పో పరిశ్రమ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు పరిశ్రమ ప్రధాన గేటు వద్ద నోటీసులు అంటించింది. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని యాజమాన్యం పేర్కొంది. ద్విచక్ర వాహనాలు నడిపే కార్మికులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించింది.

- తడ, ఆంధ్రజ్యోతి

నైమిశారణ్యంలో వైభవంగా శ్రీవారి కల్యాణం, చక్రస్నానం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్యంలోని బాలాజీ ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ వైభవంగా నిర్వహించింది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశేషాచల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకబృందం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్తసంకల్పం, మహా సంకల్పం, మాంగళ్యపూజ, మంగళ సూత్రధారణ వంటి ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే, గోమతి నదీ తీరంలో శుక్రవారం చక్రస్నానాన్ని నిర్వహించారు. నదీతీరంలో చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 15 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.23 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,908

తలనీలాలు సమర్పించినవారు: 19,549

కూటమిలో ట్రబుల్ షూటర్స్



తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నిక వైసీపీ రాజకీయ నైజాన్ని ఎరిగిన అందరినీ ఆశ్చర్య చకితులను చేసింది. దబాయింపులకు తగ్గకుండా, బెదిరింపులకు లొంగకుండా వైసీపీ జెండాతో కార్పొరేటర్లుగా గెలిచిన ఇంత మందిని ఎలా కూడగట్టగలిగారన్నదే చర్చగా మారింది. 'రాష్ట్రంలో అధికారం మనదైనా.. తిరుపతి కార్పొరేషన్‌లో అంతా వాళ్లే.. అబ్బే.. అసాధ్యం' అనుకుంటున్న సమయంలో ట్రబుల్ షూటర్స్ రంగంలోకి దిగారు. వ్యూహ నైపుణ్యాలను వెలికి తీశారు. గెలిపించి .. వైసీపీని దడిపించి చూపించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తెరవెనుక ఎన్వీ ప్రసాద్

తిరుపతి డిప్యూటీ మేయర్‌ను టీడీపీకి టర్న్ చేయడంలో ప్రధాన వ్యూహకర్త తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్. తెరవెనుక నుంచే కథ మొత్తం నడిపారు. తన ప్రధాన అనుచరుడు ఆర్సీ మునికృష్ణను డిప్యూటీ పీఠంపై కూర్చొబెట్టారు. ఎన్వీ ప్రసాద్ ఎన్నికల స్ట్రాటజీపై స్థానిక రాజకీయనాయకులు ప్రత్యేకంగా చెప్పుకుంటుంటారు. తన సినిమాను బ్లాక్‌బస్టర్ చేసేందుకు ఎంత శ్రమిస్తారో, ఎన్నిక క్రతువును తనవైపు తిప్పుకునేందుకు అంతే కష్టపడతారన్న పేరుంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి ఆయన సినిమా థియేటర్‌లోని తన ఆఫీస్‌కే పరిమితమైపోయినట్టు కనిపించినా అక్కడి నుంచే చక్రం తిప్పారు. ఆయనకు మరో ముఖ్య అనుచరుడు కార్పొరేటర్ నరసింహాచారి, యువ కార్పొరేటర్ నరేంద్రనాద్‌ల శ్రమా, సహకారం కీలకమైనవి. కూటమివైపు నిలబడే వారి సంఖ్యను మూడు నెలల క్రితమే ఆ సంఖ్యను 16కు చేర్చారు. వైసీపీ స్థానిక నాయకత్వంపై ఉన్న అసంతృప్తిని కూటమికి అనుకూలంగా మార్చుకోవడంల ఎన్వీ ప్రసాద్ పాత్ర ప్రత్యేకమైనదిగా కూటమి శ్రేణులు చెప్పుకుంటున్నారు.

యూత్ పవర్.. జేబీ

బయట ఎక్కడా కనిపించకపోయినా డిప్యూటీ మేయర్‌గా టీడీపీ ఒకే ఒక్కడు ఆర్సీ మునికృష్ణను గెలిపించుకోవడంలో కీలక పాత్ర పోషించారు జేబీ. రియల్‌ఎస్టేట్ రంగంలో ఉన్న జేబీ శ్రీనివాస్.. రాజకీయాల్లోనూ సమాంతరంగా ప్రయాణిస్తున్నారు. ఎటువంటి పరిస్థితుల్లో అయినా ఆయనను వెన్నంటి ఉండే యూత్ జేబీ బలం. క్లిష్ట పరిస్థితుల్లోనూ అనాయాసంగా పనిని చక్కదిద్దగల సామర్థ్యం ఆయనది. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ టీడీపీలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఆయనకు అండగా యూత్ ఫోర్స్‌ను దించేవాడు. ప్రత్యర్థి పార్టీలకు దీటుగా నిలబడి వ్యూహాలు రచించడంలోనూ, పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలోనూ గట్టి పట్టుంది. 2019 ఎన్నికల్లో కొర్లగుంట, జీవకోన ప్రాంతాల్లో టీడీపీకి జనరల్ ఏజెంట్‌గా పనిచేసిన జేబీ వర్గం వైసీపీ దౌర్జన్యాలను నిలువరించగలిగింది. ఈ బూత్‌ల్లో వైసీపీకి మెజారిటీ తగ్గిపోవడంతో ఆ తర్వాత అక్రమ కేసుల్లో ఇరికించారు. తిరుపతి అసెంబ్లీ టికెట్ ఆశించినవారిలో జేబీ కూడా ఉన్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమివైపునకు మళ్లించడంలో ఈయన పాత్ర చాలానే ఉంది. జేబీ యూత్ ఫోర్స్ బలమేమిటో నిరూపించారు.

'పెదబ్బ' దెబ్బకు పెడబొబ్బ

తిరుపతి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన కుటుంబం ప్రతినిధిగా ముబ్బు దేవనారాయణరెడ్డి (పెదబ్బ)కి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వెరపు ఎరగని నైజం ఆయనది. ముఖాన నవ్వు చెరగకుండానే పరిస్థితులను అదుపులోకి తెచ్చుకోగల చాతుర్యం ఆయన సొంతం. మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి చెందినా ముబ్బు పెదబ్బ పేరు నగరంలో మోగుతూనే ఉంటుంది. ముబ్బు యువసేన పేరుతో పెద్ద బలగమే ఉంది. తిరుపతి స్థానికుల్లో ఆయనకున్న స్నేహ, బంధుత్వాలే ఆయన బలం. తిరుపతిలో వైసీపీ సై అంటే.. సై అనగల దమ్మున్న నాయకుడిగా గుర్తింపు ఉంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన పెదబ్బ గత ఎన్నికల్లో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో కూటమి విజయానికి మనసుపెట్టి పనిచేశారు. తాజాగా తిరుపతిలో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఆచితూచి అడుగులేస్తూ వైసీపీకి ధాటీగానే సమాధానం ఇచ్చారు.

రవినాయుడు లాస్ట్ పంచ్

నిన్నమొన్నటి దాకా చేతిలో పుస్తకంతో యూనివర్శిటీలో కనిపించిన ఇతనేనా అని అందరూ ఆశ్చర్యపోతున్నారు అనిమిని రవినాయుడును చూసి ఇప్పుడు. రాష్ట్ర సమస్యల మీద మీడియాలో స్పందించే విద్యార్థి నాయకుడిగా మొదలైన రవినాయుడి రాజకీయ జీవితం లోకేశ్ పాదయాత్రతో కీలక మలుపు తీసుకుంది. కుప్పం నుంచి నెల్లిమర్ల దాకా యువగళానికి రక్షా కవచంలా యువసైన్యాన్ని నడిపించిన సారధిగా గుర్తింపు తెచ్చుకున్నారు. నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి', హలో లోకేశ్.. సభల నిర్వహణ బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. సీనియర్లున్నా శాప్‌ఛైర్మన్ పదవి వరించి వచ్చింది ఈ కారణాలవల్లే. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆఖరి రోజున ఆయన అనుసరించిన వ్యూహ నైపుణ్యాలు వైసీపీ అంచనాలకు అందలేదు. చాపకిందనే అంతా చక్కబెట్టేశారు.

తీరు సైతం...

డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీ వశం కావడానికి ట్రబుల్ షూటర్స్‌కు సమన్వయంగా మరికొంతమంది సహకరించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్. ఎమ్మెల్యే వాయిస్‌గా మదన్ అన్ని సందర్భాల్లోనూ చకచకా నిర్ణయాలు తీసుకుంటూ చురుగ్గా వ్యవహరించారు. కార్పొరేటర్లను శిబిరాలకు తరలించడం, వారి యోగక్షేమాల దాకా బాధ్యతగా చూసుకున్న మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిమహేష్ యాదవ్‌లు శ్రమను కూటమి నాయకత్వం ప్రశంసిస్తోంది.

'అన్నా' లెక్కలే వేరు

జీవకోన అనగానే అన్నా పేరు వినిపిస్తుంది. అధికారంలో ఎవరున్నా ఆ ప్రాంతం మీద పట్టు మాత్రం అన్నా రామచంద్రయ్యదే అన్నంతగా జీవకోనతో పెనవేసుకుపోయారు. తన వారసురాలిగా కుమార్తె అన్నా అనితను కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు. వైసీపీలో తీవ్ర అనాదరణకు గురైన ఆయన ఆ తర్వాత అదను చూసి అడుగులు కదిపారు. కుమార్తె అన్నా అనితను మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలనే లక్ష్యం పెట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలో అన్నా సత్తా ఏమిటో చూపించారు. జాతీయ రాజకీయ పరిణామాలూ.. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై అనర్గళంగా మాట్లాడగలగడం ఆయన బలం. యాదవసామాజికవర్గంలో పట్టున్న నాయకుడు. వ్యయ ప్రయాసలకు వెనుదీయకుండా డిప్యూటీ ఎన్నికలో కృషి చేశారు.

బదిలీ చేసినా కదలరంతే!

● సదరన్ డిస్కం విద్యుత్ సర్కిల్‌లో ఇదీ సంగతి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారం రోజుల్లోపు రిలీవ్ కావాలి. ఇదీ నిబంధన. కానీ సదరన్ డిస్కం పరిధిలో కొందరు దీనిని అతిక్రమిస్తున్నారు. గతేడాది సెప్టెంబరు 22వ తేదీన బదిలీ చేసినా.. ఇప్పటికీ రిలీవ్ కాలేదు. పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్‌లోని ఆయా కార్యాలయాలతో పాటు ఆపరేషన్ విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న వారిని గతేడాది సెప్టెంబరు 22న కార్పొరేట్ కార్యాలయ అధికారులు బదిలీ చేశారు. కొన్ని సంఘాల్లోని వారు ఎక్కువ మంది బదిలీ అయ్యారు. కొందరు మాత్రం పాత స్థానాల్లోనే కొనసాగుతూ.. డివిజన్, సర్కిల్ స్థాయి అధికారుల వద్దకు వెళ్లి తమను రిలీవ్ చేయకుండా చూడాలని కోరినట్లు సమాచారం. కొందరు అధికారులు నోటి మాటతో వీరి బదిలీని అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అప్పటికప్పుడే కొందరిని రిలీవ్ చేసిన అధికారులు.. మిగతావారి విషయంలో చూసీచూడనట్లు ఉండటం గమనార్హం. ఇలా ఉమ్మడి జిల్లాలో బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారిలో 10 మందికి పైగా మౌఖిక ఆదేశాలతో తిరుపతిలో కొందరు, శ్రీకాళహస్తిలో బదిలీ ఆర్డరు తీసున్న ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు రిలీవ్ కాకుండా కొనసాగుతున్నట్లు తెలిసింది. దీనిపై క్షేత్రస్థాయిలో ఏఈలను వివరణ కోరగా.. ఉన్నత స్థాయి అధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారని చెప్పారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఈఈ చిన్నరెడ్డెప్పను విచారించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీ చేసినవారు రిలీవ్ కాలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి తెలిపారు. ఆ విషయాన్ని సీఎండీతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మాతృభాషతోనే మానసిక వికాసం

● '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాతృభాషతోనే మానసిక వికాసం కలుగుతుందని, విద్య, విజ్ఞానం సమకూరుతుందని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. తిరుపతిలోని సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృభాషపై పట్టుసాధిస్తేనే ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం సాధించగలమన్నారు.అందుకే విద్యార్థులందరికీ తెలుగు ధారాళంగా చదవడం, మాట్లాడేలా తీర్చిదిద్దేందుకు 'తెలుగు రీడింగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకుడు భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. 30 రోజుల్లో ధారాళంగా చదవగలిగేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ఓ ప్రోగ్రామ్‌ను రూపొందించి సత్ఫలితాలు సాధించినట్టు చెప్పారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం భాస్కర్‌రాజు రూపొందించిన తెలుగుభాష సంజీవిని పుస్తకాలను విద్యార్థులకు డీఈవో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో బాలాజీ, డీఈవో కార్యాలయ ఐటీ సెల్ మానిటరింగ్ అధికారి ధనుంజయులు నాయుడు, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయిని విజయకుమారి, ఇతర ఉపాధ్యాయులు, భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ రీసెర్చ్ సెంటర్ ఇన్‌స్ట్రక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో పరిచయం

● ఉద్యోగం పేరిట అసభ్యకర చాటింగ్‌పై ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగావకాశాలను చూస్తుండగా ఓఎల్‌ఎక్స్‌లో పరిచయమయ్యాడు. కార్యాలయం పెడతామంటూ తిరుపతికి వచ్చాడు. ఆపై సినిమాకు, తిరుమలకు వెళ్దామంటూ ఆ మహిళను ఒత్తిడి చేశాడు. ఈ మేరకు బాధితురాలి భర్త శుక్రవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటకు ఓ వివాహిత ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. ఓఎల్‌ఎక్స్‌లో సెర్చ్ చేస్తుండగా హైదరాబాదుకు చెందిన సునీల్‌కుమార్ మొబైల్ నెంబరు అందులో కనిపించింది. ఉద్యోగం కోసం ఆమె అతడితో వాట్సాప్ ద్వారా చాటింగ్ ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం తిరుపతికి వచ్చిన సునీల్‌కుమార్.. ఇక్కడ ఓఎల్‌ఎక్స్ కార్యాలయం పెట్టేందుకు గది చూడాలని చెప్పాడు. ఇద్దరూ అద్దెకు గది కోసం వెదికారు. ఇటీవల హోటల్‌లో భోజనం చేశాక తిరుమలకు వెళ్దామని ఆమెను పిలిచాడు. ఆమె ససేమిరా అన్నారు. తాను లీలామహల్ వద్ద ఉన్నానని, సినిమాకు వెళ్దామంటూ ఆమెతో చాటింగ్ చేశాడు. అతడి వైఖరిని అనుమానించిన ఆమె భర్తకు విషయం చెప్పారు. వెంటనే వారు డయల్ 100కు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. వీరిచ్చిన సమాచారం మేరకు సునీల్‌కుమార్‌ను అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

18 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 26వ తేది వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ ఈవో శ్యామలారావు శుక్రవారం సాయంత్రం తిరుమలలోని ఈవో క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుందన్నారు. 17వ తేది అంకురార్పణ, 18న ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్నశేష, రాత్రి హంస, 20న సింహ, ముత్యపు పందిరి, 21న కల్పవృక్ష, సర్వభూపాల, 22న మోహినీ అవతారం, రాత్రి గరుడ సేవ, 23న హనుమంతు, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 25న రథోత్సవం, అశ్వవాహన సేవలు ఉంటాయని ఈవో వివరించారు. 26న ఉదయం చక్ర స్నానం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అర్చకులు పార్థసారధి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, అధికారులు

వైసీపీకి షాక్

● పార్టీకి జడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచులు, కార్యకర్తల రాజీనామా

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఆ పార్టీ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డిని పార్టీ నుంచి సస్పెండు చేశారు. ఆయనకు మద్దతుగా జడ్పీటీసీ సభ్యురాలు ఆరణి ప్రతిమ, ఆర్‌అనంతపురం, కాటూరు, ఆలత్తూరు ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య, రవి, వరలక్ష్మి, వెస్ట్‌వరత్తూరు సర్పంచ్ దయా, బీఎన్‌కండ్రిగ సర్పంచ్ మునిరాజా, పలువురు కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం నీర్పాకోటలో ప్రకటించారు. మరికొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు కూడా రాజీనామా చేయనున్నారని జడ్పీటీసీ ప్రతిమ తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటతామన్నారు. వైసీపీ మండల సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, నాయకులు గిరిరెడ్డి, మునస్వామి, భాస్కరయ్య తదితరులున్నారు.

మిస్ గ్లోబల్ ఆసియా విజేతకు సీఎం అభినందన

చంద్రగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరిగిన మిస్ గ్లోబల్ ఆసియా పోటీలలో విజేతగా నిలిచిన చంద్రగిరికి చెందిన భావనరెడ్డిని సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. విజేతగా నిలిచిన ఆమె తన తండ్రి గోపికృష్ణతో పాటు తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రవీణ్, కోటేశ్వరరావు, శేఖర్, బాషాతో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. అంతర్జాతీయ వేదికపై చంద్రగిరి పేరును గట్టిగా వినిపించారంటూ సీఎం ఆమెను ప్రశంసించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, రాంప్రసాద్‌రెడ్డిని కూడా వీరు కలిశారు.



భావనరెడ్డిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యతా ఉండాలి

● మందుల విక్రయదారుల అవగాహన సదస్సులో ఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(వైద్యం),ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'వయసుతో సంబంధం లేకుండా కొందరు పలు రకాల మత్తుకు బానిసలవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టాలంటే మీ సహకారం అవసరం. వ్యాపారంతో పాటు సమాజంపై బాధ్యత కూడా ప్రధానమనే విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకోవాలి' అని జిల్లాలోని ఔషధ విక్రయదారులకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులోని ఫ్యాబ్ భవనంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అందరి సహకారం అవసరమన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలతో పాటు కొందరు మందుల దుకాణాల్లో లభించే పలు మత్తునిచ్చే ఔషధాలకు అలవాటు పడి ఆరోగ్యంతోపాటు జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. దీనిని అరికట్టాలంటే డాక్టర్ రశీదు లేకుండా మందులు విక్రయించడం, చిన్నారులకు మందులు విక్రయించడం వంటివి చేయకూడదన్నారు. రశీదులు నిజమైనవా, నకిలీవా అనేది చూసుకోవాలన్నారు. కొన్ని నిషేధిత మందులు, మత్తును ఇచ్చే మందుల విక్రయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించి మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రుయాస్పత్రి డీ అడిక్షన్ సెంటర్ మానసిక వైద్య నిపుణురాలు మానస మాట్లాడుతూ అనుభవంతో ఇచ్చే కొన్ని రకాల మందుల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశముందని తెలిపారు. డాక్టర్ సలహా లేకుండా మందులు ఇస్తే ఎలాంటి నష్టాలు ఉంటాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, డీఐవోలు సుభాషిణి, రూతు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు



త్రినేత్ర అతిథి గృహం వద్ద రంగులు అద్దుతున్న కళాకారులు





స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జంగమయ్య పండుగ మహాశివరాత్రి వేడుకలకు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు 14రోజుల పాటు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 26న మహాశివరాత్రి, 27 ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28వ తేదీ అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీసేవ ఉత్సవాలు ప్రధాన ఘట్టాలు. ఆయా రోజుల్లో జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తుల రద్దీ ఉంటుంది. అందుకు అనుగుణంగా భక్తులు బస చేసేందుకు షెడ్లు, ఇతర సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయం లోపల గురువారం రంగురంగుల ముగ్గులు తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల వాహనాలకు రంగులు అద్దుతున్నారు. అలాగే ధ్వజస్తంభం, మహద్వారం ప్రదేశాల్లో అద్దిన రంగులు భక్తులను ఆకట్టుకున్నాయి.

డాలర్ కేంద్రం డొల్లతనం

● పాడైన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులు



తిరుమల, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): డాలర్ల విక్రయ కేంద్రం అస్తవ్యస్తంగా తయారైంది. పాడైపోయిన పైకప్పు, ఊడుతున్న గోడపెచ్చులతో ఆందోళన కలిగిస్తోంది. 40 ఏళ్లగా టీటీడీ శ్రీనివాసుడు, పద్మావతి అమ్మవార్లుండే బంగారు, వెండి డాలర్లను విక్రయిస్తోంది. భక్తుల నుంచి మంచి స్పందన వస్తున్న క్రమంలో తొలుత బయోమెట్రిక్, తర్వాత లడ్డూకౌంటర్ల వద్దకు విక్రయకేంద్రాన్ని మార్చారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆరేళ్ల క్రితం శ్రీవారి ఆలయం ముందున్న పుస్తకవిక్రయశాల వద్ద విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని ఈ కౌంటర్ ద్వారా రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు విక్రయాలు జరుగుతాయి. పర్వదినాల్లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు విక్రయాలుంటాయి. అక్షయతృతీయ వంటి రోజుల్లో రూ.75 లక్షల వరకు అమ్మకాలు సాగుతాయి. ఇంత విలువైన కౌంటరు పైకప్పుతో పాటు గోడపెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షమొస్తే రేకుల నుంచినీరు కౌంటర్‌లోకి చేరుతోంది. సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లు పెడుతున్నారు. కౌంటర్ వద్ద కనీస భద్రత లేదు. గేట్లకు గొళ్లాలు కూడా లేకపోవడంతో సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల వెండి, రాగి డాలర్ల కోసం వస్తున్న భక్తులు నోస్టాక్ బోర్డు చూసి నిరాశ చెందుతున్నారు.




పాడైపోయిన పైకప్పు, గోడలు



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడికి ఇస్తున్న ఇంజక్షన్

గుప్పెడంత గుండెకు కొండంత భరోసా

- స్టెమి ప్రాజెక్టుతో సాధ్యం చేస్తున్న ప్రభుత్వం
- రూ.45వేల టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తోంది
- గుండెపోటుతో ప్రాణం పోకూడదన్నదే లక్ష్యం
- ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 153 మంది ప్రాణాలను కాపాడారు



టెనెక్టెప్లెస్ ఇంజక్షన్

● వారం రోజుల కిందట చిత్తూరు నగరానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తికి ఛాతీనొప్పి వచ్చింది. కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈసీజీ తీసిన వైద్యులు గుండెకు సరఫరా చేసే నాళంలో రక్తం గడ్డకట్టినట్లు (స్టెమి)గా గుర్తించారు. వెంటనే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాపాయం తప్పింది. ఆ తర్వాత తిరుపతిలోని రుయాస్పత్రికి తీసుకెళ్లి గుండె ఆపరేషన్ చేయించడంతో కోలుకున్నాడు.

● నగరి మండలానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తికి గుండెనొప్పి రావడంతో కుటుంబీకులు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఈసీజీ తీయగా స్టెమి అని తెలిసింది. వెంటనే ఆ రిపోర్ట్‌ను హబ్ ఆస్పత్రి అయిన తిరుపతి రుయాకు యాప్‌ద్వారా పంపారు. వైద్యనిపుణుల సలహాతో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాపాయం తప్పింది. ఆ తర్వాత రుయాస్పత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోగా, కోలుకుంటున్నాడు.



చిత్తూరు రూరల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): వయసుతో సంబంధం లేకుండా యుక్త వయసులోనూ గుండెపోటుకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యనిస్తూనే హృదయానికి రక్షగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గుండెపోటుతో ఎవరూ మరణించకూడదనే లక్ష్యంతో స్టెమి (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రక్తనాళం పూడుకుపోయిన సందర్భంగా వచ్చే తీవ్ర గుండెనొప్పిని స్టెమి అంటారు. దీనికి తక్షణ చికిత్స అవసరం. బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 23 ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టెమి ప్రాజెక్టు పేరుతో 'గోల్డెన్ అవర్' చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. ఇటువంటి గుండెనొప్పి వచ్చిన గంటలోపు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొస్తే బాధితుడికి రూ.45వేల టెనెక్టెప్లెస్ అనే ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నారు. ఈ ఇంజక్షన్ వేశాక బ్లాక్ అయిన రక్తనాళం తెరుచుకుని బాధితుడి ప్రాణాలను కాపాడుతుంది. తర్వాత రెండు నుంచి మూడు గంటల సమయం లభిస్తుంది. దీంతో పెద్ద ఆస్పత్రికెళ్లి గుండె ఆపరేషన్ చేయించుకుని ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 163 మందికి స్టెమి ప్రాజెక్టు కింద టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లు ఇచ్చారు. వీరిలో 153 మంది ప్రాణాలు కాపాడారు.

టెలీ మెడిసిన్ ద్వారా చికిత్స

ఛాతీనొప్పి, శ్వాస సక్రమంగా ఆడకపోవడం, చెమటలు పట్టడం, వికారం, వాంతులవ్వడం వంటి లక్షణాలు గుండెనొప్పికి కారణాలుగా చెబుతారు. ఈ లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన రోగికి ఆక్సిజన్ పెట్టి.. ఈసీజీ తీస్తారు. దీన్ని యాప్ ద్వారా హబ్ ఆస్పత్రికి పంపుతారు. అక్కడున్న గుండెవ్యాధి నిపుణులు పరిశీలించి స్టెమి అయితే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ సిఫార్సు చేస్తారు. లేదంటే ఈసీజీ రిపోర్టుకు తగ్గట్టుగా మందులు, ఇంజక్షన్ వేయాలని సూచిస్తారు.

అందుబాటులో నిర్ధారణ పరికరాలు

జిల్లాలోని ఏడు ఏరియా ఆస్పత్రులు, 15 సీహెచ్‌సీల్లో, ఓ జిల్లా ఆస్పత్రిలో కావాల్సిన 25 రకాల మందులు, టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లు, ఈసీజీతో పాటు వ్యాధి నిర్ధారణకు ఎనిమిది రకాలు పరికరాలను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు రిఫ్రిజిరేటర్, ప్రత్యేక బెడ్, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న కంప్యూటర్ అందుబాటులో ఉంటుంది.



అవగాహన అవసరం

చాలామంది స్టెమిపై అవగాహన లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. పూర్తి బ్లాకేజ్‌తో ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యులు టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ చేయాలని చెబుతున్నా నిరాకరిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి తిరిగి ఇదే ఇంజక్షన్‌ను రూ.45వేలు ఇచ్చి వేయించుకుంటున్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టెమికి ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

- డాక్టర్ అరుణ్‌కుమార్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్



ఉచితంగా అందిస్తున్నాం

గుండెపోటుకు గురై ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే బాధితుల ప్రాణాలను కాపాడేందుకు రూ.45 విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ఏడు ఏరియా, 15 సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంది.

- ప్రభావతి, డీసీహెచ్ఎస్

పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



పార్లమెంటులో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రాంతాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ప్రకటించారని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంటు సమావేశాల్లో జరిగిన 2025 ఆర్థిక బడ్జెట్ చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని చెప్పారు. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ రంగాలకు ఊతమిచ్చారని ప్రశంసించారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన చట్టాన్ని అమలు పరచడంలో భాగంగా ఎన్డీయే సర్కార్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ బడ్జెట్‌లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.11,440 కోట్లు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ స్థాపనకు రూ.15వేల కోట్లు, అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించిందని కొనియాడారు.

జగన్ ఇక ఎప్పటికీ సీఎం కాలేరు

● టీడీపీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'జగన్ మళ్లీ సీఎం అవుతారని పగటి కలలు కంటున్నారు. ఆయన ఇక ఎప్పటికీ సీఎం కాలేరు' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు ఒక్క చాన్స్ ఇచ్చిన పాపానికి 1.0లో జనానికి తన విశ్వరూపం చూపించి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఇక జగన్‌కు 2.0కు చాన్సు లేదని స్పష్టం చేశారు. ఇసుక, మద్యం, మైన్స్, రేషన్ బియ్యం, ఎర్రచందనం, గంజాయి.. ఇలా అనేక మాఫియాలను తయారు చేసి ప్రజా సంపదను, సహజ వనరులను లూటీ చేశారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి, వారిని దగా చేశారన్నారు. పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని చెప్పారు.ప్రజలకు కనీసం మాట్లాడే స్వేచ్ఛకూడా లేకుండాచేసి, నియంతపాలన సాగించారని.. ఇవన్నీ రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు.

విద్యుత్‌శాఖ స్టోర్స్ డీఈ బాధ్యతల స్వీకారం



వసంతనాయుడు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్ డీఈగా వసంతనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈ బాలాజీకి ఈఈగా పదోన్నతి రావడంతో ఆయన్న తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో డీఈగా ఉన్న వసంతనాయుడిని బదిలీ చేశారు.

23న గంటా కమలమ్మ సాహితీ పురస్కార కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని విజయం డిగ్రీ కళాశాలలో ఈనెల 23వ తేదీన 2024 సంవత్సరానికి గంటా కమలమ్మ సాహితీ పురస్కార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు గంటా మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గంటా కమలమ్మ కవితా పురస్కారాలకు పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 35 మంది సాహితీవేత్తలు పోటీపడ్డారన్నారు. వీరిలో శ్రీకాకుళానికి చెందిన సాంబమూర్తి లండ, నల్గొండవాసి తుల శ్రీనివాస్ పురస్కారాలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. వీరికి రూ.10వేలతో పాటు జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు.

మరో ముగ్గురు టీచర్లకు చార్జి మెమోలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం, విద్యార్థినులపట్ల దురుసు ప్రవర్తనతో మరో ముగ్గురు టీచర్లకు డీఈవో వరలక్ష్మి శుక్రవారం చార్జి మెమోలు జారీ చేశారు. విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న ధనశేఖర్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటుపడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన కారణాలతో స్థానిక డివిజన్ ఇన్‌చార్జి నాగలక్ష్మి ఫిర్యాదుతో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో తేలిన అంశాల ఆధారంగా ఇదే పాఠశాలలోని పీడీ భువనేశ్వరితోపాటు హిందీ టీచర్ జ్యోతీశ్వరి, మ్యాథ్స్ టీచర్ మనోహర్‌లకు డీఈవో చార్జి మెమోలు ఇచ్చారు. ఈ వ్యవహారానికి సంబంధించి పాఠశాల విద్యార్థినుల ఫోన్ సంభాషణలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, విద్యాశాఖ అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

నాన్న అడుగు జాడల్లో నడుస్తా

నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్



తండ్రి ముద్దుకృష్ణమ నాయుడి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడంలో తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు అడుగు జాడల్లో నడుస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. మాజీ మంత్రి ముద్దుకృష్ణమ ఏడో వర్ధంతిని పురస్కరించుకుని తమ స్వగ్రామం రామచంద్రాపురం మండలంలోని వెంకట్రామాపురంలో ఉన్న తండ్రి సమాధివద్ద శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం నగరి ఏరియా వైద్యశాలలో రోగులకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టవర్‌క్లాక్ వద్ద తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. తర్వాత ముద్దుకృష్ణమ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి.. సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడంలోనూ, టీడీపీ కార్యకర్తల కష్ట, నష్టాల్లో తన తండ్రి ఎప్పుడూ ముందుండేవారని, తాను కూడా అలాగే ఉంటానని చెప్పారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, మండల అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గుణశేఖర్, జ్యోతినాయుడు, సురేష్‌నాయుడు, రుక్కుం బాలాజీ, చిట్టి, మదివాసన్, మాణిక్యవాసన్, నారాయణస్వామి నాయుడు, ఉమాపతిరాజు, తెలుగు యువత నగరి అధ్యక్షుడు శ్రీధర్, కరుణ, సెల్వమణి, గుణ, దయాలన్, కన్నివేలురెడి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 50 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న చిత్తూరు రైల్వే పోలీసులు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న రైల్వే పోలీసులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఓ అంతర్రాష్ట్ర దొంగను చిత్తూరు రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 50 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం మీడియాకు వివరాలు తెలిపారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో గురువారం సాయంత్రం ప్లాట్‌ఫారం రెండులో రైల్వే పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తున్నారు. వీరిని చూసి ఓ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటాడి పట్టుకున్నారు. విచారణలో ఇతనో అంతర్రాష్ట్ర దొంగగా తేలింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన ప్రకాష్‌గా గుర్తించారు. ఆ రాష్ట్రంలోనే 11 కేసులు ఇతడిపై ఉన్నాయి. ప్రస్తుతం తమిళనాడు, ఏపీలో దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి 14 గ్రాముల బంగారు గాజు, 16 గ్రాముల గోల్డ్ చైను, 20 గ్రాముల హనుమాన్ డాలర్ కలిగిన చైను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేకి ఘనస్వాగతం



రేణిగుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు ఘన స్వాగతం లభించింది. మదనపల్లె, పలమనేరుల్లో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాలను ప్రారంభించేందుకు గాను ఆయన వచ్చారు. విమానాశ్రయం వద్ద సీజేకి జేసీ శుభం బన్సల్, తిరుపతి మూడో ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎం.గురునాథ్, ప్రొటోకాల్ జడ్జి కోటేశ్వరరావు, కోర్టు సూపరింటెండెంట్ ధనంజయులు నాయుడు, తిరుపతి బార్ కౌన్సిల్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన మదనపల్లెకు బయలుదేరి వెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే, తైక్వాండో శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటే, తైక్వాండో స్వీయ రక్షణ కళల్లో శిక్షణ ఇచ్చేందుకుగాను శిక్షకులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కేవీఎన్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా 141 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 2,458 విద్యార్థినులకు, 318 ఉన్నత పాఠశాలల్లోని 30,935 మంది విద్యార్థినులకు 20 సెషన్లుగా కరాటే, తైక్వాండోలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత ట్రస్ట్‌లు, సొసైటీల్లో రిజిస్టర్ అయినవారు, శిక్షణలో కనీసం మూడేళ్ల అనుభవం కలవారు 11వ తేదీ మధ్యాహ్నంలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకోసం కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఐదవ రోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె

వెటర్నరీ లోగో ఆకారంలో వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకార వేతనం(స్టైఫండ్) పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె ఐదవ రోజు శుక్రవారమూ కొనసాగింది. కళాశాల క్రీడా మైదానంలో వెటర్నరీ వైద్యులకు సంబంధించిన లోగో ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలను కలసి తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్‌బాబు, అచ్చెన్నాయుడులకు మెయిల్ ద్వారా వినతి పంపామని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్ష ప్రారంభించామని, ప్రభుత్వం నుంచి జీవో వచ్చే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు

ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి



సమావేశంలో ప్రసంగిస్తున్న పీడీ వెంకటేశ్వరి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై రెండ్రోజుల శిక్షణ ముగింపు సమావేశం శనివారం రాజ్‌మహల్ సమావేశపు హాలులో జరిగింది. సీడీపీవోలు కృష్ణవేణి, చంద్రకళ, ప్రథమ్ జిల్లా సమన్వయకర్తలు మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసేందుకు దివ్యాంగుడి సైకిల్‌యాత్ర

● కుమార్తె వైద్యం కోసం సాహసం



మూడుచక్రాల సైకిల్‌పై విజయవాడకు వెళుతున్న దివ్యాంగుడు బాలకృష్ణ

శాంతిపురం, బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన కుమార్తెకు వైద్యం చేయించి ఆదుకోవాలని కోరుతూ తన సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలియజేయడానికి ఆయన అభిమాని దివ్యాంగుడు బాలకృష్ణ శుక్రవారం సైకిల్‌యాత్ర చేపట్టారు. శాంతిపురం మండలం కోలాల తిమ్మనపల్లె గ్రామానికి చెందిన ఆయన తన మూడుచక్రాల సైకిల్‌పై బయలుదేరి శాంతిపురం నుంచి బైరెడ్డిపల్లెకు చేరుకున్నాడు. అతడి కథనం మేరకు.. బాలకృష్ణ దంపతులిద్దరూ దివ్యాంగులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మొదటి కుమార్తె అశ్వని ప్రస్తుతం తొమ్మిదో తరగతి, రెండో కుమార్తె హేమలత ఆరో తరగతి, కుమారుడు చందన్‌కుమార్ నాలుగో తరగతి చదువుతున్నారు. తనకు ప్రతినెలా వచ్చే వికలాంగ పింఛనుతో జీవనం గడుపుతున్నారు. తన పెద్ద కుమార్తె అశ్వని అనారోగ్యానికి గురికావడంతో గత మూడేళ్ల క్రితం చెన్నైలోని ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించగా బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యం చేయడానికి దాదాపు రూ.14 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో బాలకృష్ణకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అప్పటినుంచి ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తన బాధ చెప్పుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. మొదటి నుంచి పవన్‌కల్యాణ్‌కు అభిమానినైన తాను ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను స్వయంగా కలిసి సమస్యను విన్నవించడానికి సైకిల్‌యాత్ర చేపట్టినట్లు చెప్పారు. తన కుమార్తెకు వైద్యం చేయించి ఆదుకోవాలని దివ్యాంగుడు బాలకృష్ణ తెలిపారు.

10 మద్యం దుకాణాలకు 35 దరఖాస్తులు

నేటితో ముగియనున్న గడువు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు శుక్రవారంనాటికి 35 దరఖాస్తులు వచ్చాయి. శనివారం సాయంత్రం ఐదు గంటలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగుస్తుంది. పదో తేదీన ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా దుకాణాలను కేటాయిస్తారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



విజేతలైన విద్యార్థులతో బీసీఎన్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో నాయకత్వ లక్షణాలు బలపడుతాయని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్ అన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాలలో శుక్రవారం వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీఎన్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహం, సౌభ్రాతృత్వాలు పెంపొందుతాయన్నారు. మానసిక, శారీరక దృఢత్వంతోపాటు చక్కని భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థి స్థాయి నుంచే క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రీడోత్సవాలను పురస్కరించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు క్రీడా జ్యోతితో ప్రదర్శన చేశారు. యూనివర్శిటీ క్రీడల్లో రాణించి జోనల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బీసీ.నాగరాజ్ అభినందించారు. అనంతరం ఫుట్ బాల్, క్రికెట్, బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ కబడ్డీ, రన్నింగ్ రేస్‌లు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్, సీఈవో ఎన్.సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల జోసఫ్, ఫిజికల్ డైరెక్టర్ సతీశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పని ఆధార్ కష్టాలు



సోమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సోమల సచివాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంలో అవస్థలు పడుతున్నారు. మండలంలో నెల్లిమంద, ఆవులపల్లె సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినా అక్కడ యాప్‌లు పనిచేయకపోవడం, సిబ్బంది సెలవులపై వెళ్లడంతో మండలంలోని విద్యార్థులందరూ తల్లిదండ్రులతో సోమల సచివాలయం వద్దకు వచ్చి నిరీక్షిస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఆధార్ నమోదు ఆపరేటర్ ఒత్తిడితో మూడు నెలలు సెలవులో వెళ్లిపోయాడు. ఈక్రమంలో చిన్నఉప్పరపల్లె సచివాలయ ఉద్యోగి హరీశ్‌ను ఆధార్ నమోదుకు నియమించారు. అధికారులు స్పందించి ఆవులపల్లె, నెల్లిమంద సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి సోమలకు చేరుకుని ఆధార్ నమోదుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని పలమనేరు పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో జరిగిన పెన్షనర్ల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరికల్చర్ డిపార్టుమెంట్ నుంచి రిటైర్ అయిన సత్యనారాయణప్రసాద్‌కు కొత్తగా సభ్యత్వం కల్పించారు. కార్యదర్శి దొరస్వామి మాట్లాడుతూ ఈనెల 28లోపు విశ్రాంత ఉద్యోగులందరూ లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. సమావేశంలో పలమనేరులోని పెన్షనర్లు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య సంరక్షణకే పౌష్టికాహారం



పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, అధికారులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో అరుణశ్రీ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయనున్న పౌష్టికాహార కిట్లను టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో పారిశ్రామిక అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు జనసేన నాయకుడు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చదళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో వాణిజ్య పంటలపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారని.. కూటమి ప్రభుత్వంలో హంద్రీ-నీవా కాలువతో సాగునీరు ఇవ్వడానికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎన్నికల్లో జనసేన పార్టీని అధిక స్థానాల్లో గెలిపించి డిప్యూటీ సీఎంకు కానుకగా ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు శివకుమార్‌రెడ్డి, పగడాల రమణ, విరూపాక్షి, చిన్నారాయల్, చైతన్యరాయల్, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, హరినాయక్, బాలాజీనాయక్, పాముల హరి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రచన

చౌడేపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జాలప్ప కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం డాక్టర్ రచన కంటి పరీక్షలు నిర్వహించి ఆరుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పవన్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ యూనిట్లకు శ్రీకారం



కందూరులో క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాట్లు చేస్తున్న కార్యదర్శి జయశంకర్

సోమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కందూరు పంచాయతీలోని తాగునీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ యూనిట్స్‌ను అమర్చినట్లు కార్యదర్శి జయశంకర్ తెలిపారు. శుక్రవారం పంచాయతీలోని కందూరు, సామాధిగుట్ట, తొప్పన్నగారిపల్లె, ఊరమాదిగపల్లె గ్రామాల్లోని తాగునీటి పథకాలకు నీటిసరఫరా చేసే పైప్‌లైన్ వద్ద క్లోరినేషన్ యూనిట్లను ఏర్పాట్లు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జేఈ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమాంబ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి శిలా విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వి.కోట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బైరుపల్లె పంచాయతీ బంగాళాఊరు గ్రామంలో వెలసిన బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన ఆలయం వద్ద ఆలయ అర్చకులు గిరిధరశర్మ నేతృత్వంలో గణపతి పూజ, నవగ్రహ హోమాలు చేపట్టారు. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్ తదిరులు హాజరై అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు



వి.కోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వి.కోట పట్టణంలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండోరోజు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై కొలువుదీరి ఊరేగారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపటి నుంచి టీడీపీ సమావేశాలు

కుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు కుప్పం మున్సిపల్ టీడీపీ సర్వసభ్య సమావేశాలు ఈనెల 9 నుంచి 13 వరకు జరుగనున్నాయి. కుప్పం టీడీపీ కార్యాలయంలో ఈనెల 9, 10 తేదీలలో కుప్పం మున్సిపల్, కుప్పం మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తారు. అలాగే 11న శాంతిపురంలోని బాలాజీ కల్యాణ మండపంలో శాంతిపురం, 12న రామకుప్పంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో రామకుప్పం మండలం, 13న గుడుపల్లెలోని రాళ్లగంగమ్మ దేవస్థానం ఆవరణలో గుడుపల్లె మండల టీడీపీ సమావేశాలు నిర్వహిస్తారు. జన నాయకుడు పోర్టల్, గ్రీవెన్స్ సెల్ పై ఇంటింటి ప్రచారం, మండలాలలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వం పనితీరుపై ప్రజల అభిప్రాయం ఎలా ఉంది తదితర అంశాల గురించి ఆయా సమావేశాల్లో చర్చించనున్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

సోమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమలలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల్లో మాదిగ జాతికి తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ డివిజన్ నాయకులు మంద రామనాథం, ప్రకాశ్, శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందించాలి

సోమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ శివారు గ్రామాల రైతులకు సబ్సిడీ సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని బీజేపీ మండలాధ్యక్షుడు హేమగిరి కోరారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లె రైతులతో కలిసి సచివాలయంలో అధికారులకు విన్నవించారు. మండలంలో విస్తారంగా మామిడి, టమోటా, బొప్పాయి తోటలు ఉన్నాయని.. ఏటా ఏనుగుల దాడులతో రైతులు నష్టపోతున్నామని తెలిపారు. నష్టపోయిన పంటలకు అటవీ అధికారులు మొక్కుబడిగా నష్ట పరిహారంతో కాలయాపన చేస్తున్నారని వాపోయారు. ఆవులపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, పెద్దఉప్పరపల్లె ప్రాంతాల రైతులు ఏనుగులు, అడవి పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అధికారులు స్పందించి సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందజేయాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

వి.కోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సంక్షేమ వసతి గృహ ఏఎస్‌వో మీనాక్షి తెలిపారు. శుక్రవారం వి.కోట బాలుర వసతి గృహ ఆవరణలో 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పిల్లలు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరిశీలనకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన మేరకు శిక్షకులతో ప్రేరణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చిట్టిబాబు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరి చెట్లకు మంటలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చౌడేపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలపల్లెకు చెందిన రైతు నరేష్ కు చెందిన పొలంలోని నీలగిరి చెట్లకు శుక్రవారం మధ్యాహ్నం అగ్ని మంటలు వ్యాపించాయి. గుర్తించిన రైతు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు. పొలం సమీపంలోనే నివాసాలు ఉండటంతో మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

న్యాయవిజ్ఞాన సదస్సులో కుప్పం జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ





సదస్సులో మాట్లాడుతున్న కుప్పం జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ, హాజరైన మహిళా కార్మికులు

కుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్త్రీలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ అన్నారు. స్త్రీలపై వేధింపులు, చట్టాలు అనే అంశంపై శుక్రవారం కుప్పంలోని షాహీ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ కంపెనీలోనే వేధింపుల నిరోధానికి సంబంధించి ఒక కమిటీ ఉందని, అటువంటి వేధింపులేవైనా ఉంటే ఆ కమిటీకి, కోర్టులో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. స్త్రీల హక్కుల రక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలను గురించి వివరించారు. స్త్రీలు ఎవరైనా అన్యాయం జరిగినప్పుడు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, కార్యదర్శి కె.ఉదయకుమార్, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, న్యాయవాదులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పుంగనూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణవంశీ

పిల్లల్ని పనులకు పంపడం చట్టరీత్యా నేరం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలను పనులకు పంపడం చట్టారీత్యా నేరమని పుంగనూరు సీనియర్ సివిల్‌జడ్జి కృష్ణవంశీ సూచించారు. శుక్రవారం స్థానిక నక్కబండలోని కస్తూరిబా పాఠశాల ఆవరణలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయరాదని.. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సీఐ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీర్లమాన్యం భూముల సర్వే



పీర్లమాన్యం భూముల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పుంగనూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ శుభారాం డిగ్రీ కాలేజీ వెనుకవైపున ఉన్న పీర్లమాన్యం భూములను శుక్రవారం రెవెన్యూ అధికారులు సర్వే చేసి సర్వే నివేదికను ముస్లిం మైనార్టీలకు అప్పగించారు. జమీందారులు పూర్వం పీర్ల పండుగ కోసం భూములు ఇవ్వగా.. ఆ భూముల ఆక్రమణలు తొలగించాలని రాతి మసీదు కమిటీ పెద్దలు, మైనారిటీలు రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ రాముకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ శ్రీనివాసులునాయక్ డిగ్రీ కాలేజీ సమీపంలోని సర్వే నెంబరు 43/1లోని 3.52 ఎకరాలను సర్వే చేసి హద్దులు గుర్తించారు. పీర్ల మాన్యంగా ఉన్న వివరాలను మైనారిటీ నాయకులకు అందజేశారు. రాతిమసీదు కమిటీ కార్యదర్శి సద్దాంహుస్సేన్, ముస్లిం నాయకులు దితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకాల పంపిణీ



పెద్దబాలశిక్ష పుస్తకాలతో విద్యార్థులు

గంగవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో పెద్దబాలశిక్ష పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన తల్లి పైనేని మునెమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెద్దబాలశిక్ష పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఏటా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రోహిణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరుపల్లె పాఠశాల తనిఖీ



మౌలిక వసతులు పరిశీలిస్తున్న పలమనేరు ఆర్డీవో భవాని

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పలమనేరు ఆర్డీవో భవాని తెలిపారు. శుక్రవారం పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం, వసతులు, విద్యాబోధన తదితర సమస్యలపై ఆరా తీశారు. పుంగనూరు ఎంపీడీవో మాధవీలత, సీడీపీవో రాజేశ్వరి, హెచ్‌ఎం మహేశ్‌నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచిరెడ్డిపల్లెలో జ్వరాల సర్వే తనిఖీ



గంగవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలంలో జరుగుతున్న జ్వరాల సర్వేను శుక్రవారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంచిరెడ్డిపల్లెలోని ఇంటింటికీ వెళ్లి పలువురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్తపరీక్షలు చేయించి వైద్యం అందించాలని సూచించారు. గ్రామంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయశంకర్, ఏఎంవో రామచంద్రారెడ్డి, రవిచంద్ర, ఏఎన్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు



కుప్పం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో...

కుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని కుప్పం ఎంపీడీవో విజయత్ అన్నారు. ఈనెల 10వ తేదీన జరుగనున్న జాతీయ నులిపురుగులల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం మండల సచివాలయంలో శుక్రవారం మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. సంబంధిత ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈవో మహబూబ్ బాషా, ఎన్.కొత్తపల్లె, పైపాళ్యం, కుప్పం-3 (కొత్తపేట) కమతమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ సుభాష్‌రాజ్, డాక్టర్ జశ్వంత్, డాక్టర్ దీప్‌కుమార్, డాక్టర్ సాయి హిమాన్స్, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పలమనేరు: ఈనెల 10న నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సంబంధించిన పోస్టర్లను ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అధికారులు ఆవిష్కరించారు. ఎంపీడీవో ఖాదర్‌బాషా, తహసీల్దార్ ఇన్నసాథన్, ఎంఈవో బాలసుందరం, వైద్యాధికారిణి వి.సుదర్శని, ఎంపీహెచ్ఎస్ మధు పాల్గొన్నారు.

● గుడుపల్లె: పిల్లలకు నులి పురుగుల నివారణ కోసం మాత్రలను సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో రాధాకృష్ణ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందికి, ఉపాధ్యాయులకు అవగహన కార్యక్రమం చేపట్టారు. సీహెచ్‌వో రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతతోనే ఆరోగ్యం

శాంతిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల స్వచ్ఛతతోనే ఆరోగ్యం సాధ్యమని టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మణి పేర్కొన్నారు. శుక్రవారం రాళ్లబూదుగురు పంచాయతీలోని ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ప్రభుత్వం అందిస్తున్న చెత్తబుట్టలను సద్వినియోగం చేసుకొని పొడి, తడి చెత్త వేర్వేరుగా వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ, నాయకులు బసవరాజు, జయరాజు, కుమార్, సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఉపకేంద్రంలోని మరమ్మతుల పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుప్పం, గుడుపల్లె మండలాలలో విద్యుత్తు సరఫరా ఉండదని రెస్కో ఎండీ సోమశేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాడి ఆవుల చోరీపై కేసు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మేకనజామునపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యంనాయుడు పాడి ఆవులను శుక్రవారం పొలం వద్ద మేత కోసం వదిలాడు. సాయంత్రం వెళ్లి చూడగా కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నపిల్లల నమోదు, హైరిస్క్ కేసుల రికార్డులు పరిశీలించారు. పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, వైద్యాధికారులు డాక్టరు వినయ్, డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్, ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, హెచ్ఈ రాజేశ్వరి, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తయిండ్లకు చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు శుక్రవారం పుంగనూరు పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి ఆసుపత్రికి వెళుతున్నట్లు చెప్పిన బాలిక సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

చౌడేపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. బంగారుపాళ్యానికి చెందిన మనోహర్ సొంత పనుల నిమిత్తం తన పిల్లలు భానుప్రియ(10), అఖిల్(8) ఇద్దరితో తరిగొండకు ఆటోలో బయలుదేరారు. చారాల సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో భానుప్రియ, అఖిల్ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో వారిని మదనపల్లెకు తరలించారు.

కాలువపై అక్రమ నిర్మాణం కూల్చివేత

పుంగనూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రైవేటు బస్టాండ్ సమీపంలోని కౌండిన్యనది కాలువపై నిర్మిస్తున్న దుకాణాన్ని శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. టీ దుకాణం యజమాని ఎస్‌ఎం. రఫీ గతంలో చెక్కబంకు పెట్టుకోగా ఇటీవల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగించారు. ఈనేపథ్యంలో రఫీ టీ స్టాల్ తొలగించడంతో ఆయన కొంతకాలంగా రేకులతో షెడ్డు నిర్మించుకుంటున్నారని తెలుసుకుని మున్సిపల్ అధికారులు కాలువ స్థలంలో దుకాణం నిర్మించరాదని నోటీసులు ఇచ్చారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రాము సూచనలతో పోలీసుల బందోబస్తుతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీశ్వరరెడ్డి ఆక్రమణలు తొలగించారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఇసుకతో వ్యాపారం చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

నగరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలకు కాకుండా ఇసుకతో వ్యాపారం చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ హెచ్చరించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఇసుకను తమిళనాడుకు సరఫరా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. పీడీ యాక్టు కూడా పెడతామని స్పష్టం చేశారు. ప్రతి ట్రాక్టర్‌కు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. అలాగే ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు తర్వాత గంటల తర్వాత ఇసుక రవాణా చేయొద్దని చెప్పారు. సీఐ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ అజీజ్

ఎర్రమట్టి అక్రమ తరలింపుపై తహసీల్దార్ విచారణ

పాలసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తున్నారని కోదండరామాపురంవాసులు గురువారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం తహసీల్దార్ అరుణ కుమారి విచారణ చేపట్టారు. నరసింహాపురం పంచాయతీలోని అయ్యవారికండ్రిగలో ఇటుకల బట్టీ నిర్వహించే వైసీపీ నాయకుడు యమహా రవిని విచారించారు. కోదండరామాపురంలో పొలాన్ని చదును చేసుకుంటామని అనుమతి తీసుకుని.. అక్కడి ఎర్రమట్టిని ఇటుకల బట్టీలు ఉండే అయ్యవారికండ్రిగ ప్రాంతానికి తరలించి, పెద్ద ఎత్తున నిల్వ ఉంచడాన్ని గమనించారు. దీంతో రవిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనుమతి లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. డీటీ రిషివర్మ, సర్వేయర్ గణేష్, వీఆర్వో రమేష్‌నాయుడు పాల్గొన్నారు.


అయ్యవారికండ్రిగలో విచారిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

బీసీ కార్పొరేషన్ రుణాలపై అవగాహన కల్పించండి: ఈడీ

యాదమరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసే సబ్సిడీ రుణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఈడీ శ్రీదేవి ఆదేశించారు. కోణాపల్లె గ్రామ సచివాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రుణాలకు ఎంతమంది నమోదు చేసుకున్నారనే వివరాలను సిబ్బందినడిగి తెలుసుకున్నారు. 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని గ్రామాల్లో దండోరా వేయించాలని చెప్పారు. అనంతరం యాదమరి మండల మహిళా సమాఖ్య కేంద్రం సందర్శించి, పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏపీఎంలు ఈశ్వరి, ఏపీడీ హేమలత, సీసీ లక్ష్మీపతి, కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.


పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీదేవి

ఉద్యోగ విరమణ సన్మానం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ టీచర్ అబ్దుల్ షఫీ ఉద్యోగ విరమణ చేయడంతో శుక్రవారం ఆయన్ను సన్మానించారు. ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్, హెచ్ఎం అరుణకుమారి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎస్.శాంబశివాచారి, సర్పంచ్ దివ్య, వైస్ చైర్మన్ సుజాత, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.కిరణ్ కుమార్, యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యుడు గురుమూర్తి, ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.దేవయ్య, గుర్రప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



మోతాదుకు మించి యూరియా వాడొద్దు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి యూరియా వాడకం నష్టదాయకమని జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సంధ్యారాణి చెప్పారు. శుక్రవారం చీకూరిపల్లె గ్రామంలో ఆమె క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. యూరియా అధిక మోతాదులో వాడితే తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉందని రైతులకు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి సాదరయ్య, వీహెచ్ఏ మూర్తి, వీపీఏ అనిల్ పాల్గొన్నారు.

10న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల పదోతేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పదో తేదీన ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోనివారికి 17వ తేదీన ఇవ్వాలన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్ఎం పూర్విక, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందాం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందామని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు కాణిపాకం పంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. ఈసందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, చెప్పులు, సోపులు, కొబ్బరి నూనెను అందించారు. వారు మాట్లాడుతూ.. చెత్తతో సంపద సృష్టించడం వల్ల పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని చెప్పారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉపసర్పంచ్ విశ్వనాథరెడ్డి, మండల విస్తరణాధికారి కుసుమకుమారి, వార్డు సభ్యులు సౌందర్యరాజన్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు సోపులు అందిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తదితరులు

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 588 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన యశ్వంత్‌కు రూ.33వేలు, అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన బిందు, చైతన్యలకు రూ.5వేల వంతున నగదు బహుమతులను అందజేశారు. ఎంఈవో విజయకుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సంధాని, ఎంఈవో డీపీ మనోజ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రక్షణ కల్పించండి

ప్రేమజంట విజ్ఞప్తి


పవన్‌కుమార్ రెడ్డి, ప్రేమ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి రక్షణ కల్పించాలని వెదురుకుప్పం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పవన్ కుమారెడ్డి, పెద్దపోడు గ్రామానికి చెందిన ప్రేమ కోరారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని చెప్పినా వేరొకరితో వివాహం చేయడానికి పెద్దలు నిశ్చయించడంతో మూడ్రోజుల కిందట ఇంటినుంచి పారిపోయి పెళ్లి చేసుకున్నామని చెప్పారు. ఈ విషయం ఇరుకుటుంబాల పెద్దలకు తెలియడంతో తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు రక్షణ కల్పించాలని ఏఎస్పీని కలసి కోరామన్నారు.


శాతంబాకం సమీపంలో..


గంగుపల్లె చెరువు వద్ద..


రేణుకానగర్ మలుపు వద్ద..

అధ్వానంగా రహదారి / భయాందోళనలో వాహనదారులు

పెనుమూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో చాలా చోట్ల రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. దీంతో ఈ మార్గంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతోందనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రేణుకానగర్ వద్ద నడిరోడ్డుపై కల్వర్టుకు పెద్ద గుంతపడి నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అక్కడ నాలుగు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే మార్గంలో గంగుపల్లె చెరువు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా ఎన్నికలకు ముందు కొంత దూరం రోడ్డును తవ్వేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇటీవల కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. కేసీ ఒడ్డిగుడిసెలు, పెద్దరాజుపల్లె సమీపంలో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఉగ్రాణంపల్లె లింకు రోడ్డు వద్ద గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బీసీ కాలనీ మలుపు వద్ద సంక్రాంతి నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరొకరికి కాలు విరిగింది. అధికారులు ఇకనైనా ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముద్దుకృష్ణమ నాయుడికి ఘన నివాళి

నింద్ర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు ఏడో వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు టీడీపీ శ్రేణులు ఘన నివాళి అర్పించాయి. నింద్రలో అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరు సబ్ స్టేషన్, గాండ్లకండ్రిగ మిట్టలో శుక్రవారం ముద్దుకృష్ణమ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. పీహెచ్‌సీలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, మండల అధ్యక్షుడు రమేశ్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు పాల్గొన్నారు.



నింద్రలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్ - విజయపురంలో ముద్దుకృష్ణమ చిత్రపటానికి ఎమ్మెల్యే, టీడీపీ నేతల పుష్పాంజలి

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోండి

● విద్యార్థులకు నగరి డీఎస్పీ సూచన

నగరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా విద్యార్థులు తెలుసుకోవాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ అంశంపై శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సీఐ మహేశ్వర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచండి

విజయపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో పారిశుధ్యం మెరుగు పరచాలని డీఎల్‌పీవో పార్వతి ఆదేశించారు. శుక్రవారం పన్నూరు, సామిరెడ్డి కండ్రిగ, మాధవరంలో వివిధ పనులను పరిశీలించారు. మాధవరంలో మొక్కనాటి నీళ్లు పోశారు. ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్‌లు సునందనా మనోహర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, మమతా శ్రీరాములురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కన పేడ దిబ్బలు వేస్తే జరిమానా

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన పేడ దిబ్బలు వేస్తే జరిమానా తప్పదని కార్వేటినగరం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగరత్నమ్మ హెచ్చరించారు. శుక్రవారం కార్వేటినగరం టు పచ్చికాపల్లం, డైట్ రోడ్డు, చాకలివానిగుంట, పద్మసరస్సు రోడ్ల పక్కన ఉన్న పేడ దిబ్బలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక యుగంలో అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని విజ్ఞానసుధ జూనియర్ కళాశాల చైర్మన్ శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కళాశాల ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

పాలసముద్రం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని విద్యార్థులు, ప్రజలను ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తే తమ దృష్టి తేవాలన్నారు. ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల పరిధిలో ఆర్కేవీబీపేట దగ్గర ఉన్న నాగాలమ్మ గుడి సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 42 ఏళ్ల వయసు ఉంటుందని, ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందినవారు సబ్సిడీ రుణాల కోసం ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు 239 యూనిట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

‘ఏపీఎఫ్ఆర్’లో భూమి వివరాలు నమోదు చేసుకోండి

రైతులకు వ్యవసాయాధికారి సూచన

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ (ఏపీఎఫ్ఆర్)లో భూమి వివరాలు నమోదు చేసుకోవాలని వెదురుకుప్పం వ్యవసాయాధికారి సి.వనిత శుక్రవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి 16 అంకెలతో ఐడీ నెంబరు ఇస్తారన్నారు. ఈ ఐడీ నెంబరు పొందినవారు మాత్రమే ప్రభుత్వ పథకాలు (అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ) పొందడానికి వీలవుతుందని చెప్పారు. రైతులందరూ తమ పట్టాదారు పాసుపుస్తకం లేక వన్-బీ, అడంగల్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన సెల్ ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.

కేవీపురం దళితవాడలో స్థల పరిశీలన

విజయపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): కేవీపురం దళితవాడలో శుక్రవారం తహసీల్దార్ కిరణ్ ఇంటి స్థలాల కోసం స్థల పరిశీలన చేశారు. ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపాలని గతవారం తహసీల్దార్‌కు స్థానికులు వినతిపత్రం అందించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్పందించి సర్వే నెంబరు 183లో స్థలాన్ని పరిశీలించారు. పది రోజుల్లో అర్హులకు స్థలాలు కేటాయిస్తామన్నారు. సర్వేయర్ రాజశేఖర్, వీఆర్వో దొరస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, సీపీఐ కార్యకర్తలు రవి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

విద్యాసామగ్రి వితరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జడ్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ శ్రీకాంత్ రవల్కర్ వితరణ చేశారని హెచ్ఎం శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. రెండు బీరువాలు, 20కుర్చీలు, సౌండ్ సిస్టంను కూడా అందజేశారన్నారు. కంపెనీ మేనేజర్ మోహన్, సభ్యులు శివ, మురళి, వినాయకరెడ్డి, గోపి, లోకేశ్, దామోదరరెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్మీ నరసింహ విద్యా సంస్థ అధినేత దిలీప్‌కుమార్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్వేటినగరంలో వసతి గృహాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ ప్రేరణ సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ధనంజయరెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారులు దశరథన్, సుబ్బరత్న, వాసు, హేమలత, చంద్రకళ పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న దిలీప్‌కుమార్

17మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి నడిపిన 17 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన 17 మందిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితులను కోర్టులో హాజరు పరచగా, ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమాదేవి ఆదేశాలు జారీ చేశారు.

హాస్టల్ భవనానికి తాత్కాలిక మరమ్మతులు



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు బాలికల హాస్టల్ భవనం చిత్తూరు ఎంపీ ల్యాడ్ ద్వారా తాత్కాలిక మరమ్మతులకు నోచుకుంది. గత ఏడాది నవంబరు 20వ తేదీన ‘అమ్మో.. తలలు పగులుతాయేమో..!’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు రూ.5లక్షలను కేటాయించారు. ఈ నిధులతో ఏఎస్‌డబ్ల్యూవో షకీలా, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో పనులు చేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంక్షిప్తంగా..

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ పరిధిలో 33, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేయనున్నారు. దీనివల్ల చిత్తూరు గిరింపేట పరిసర ప్రాంతంతోపాటు యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలికల హాస్టల్‌లో తనిఖీలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బాలికల హాస్టల్‌ను శుక్రవారం రాత్రి డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి, హాస్టల్ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, వార్డెన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు దళితుల ఆత్మీయ సమావేశం

పూతలపట్టు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పూతల మండల దళితుల ఆత్మీయ సమావేశం ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు దళిత నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి సంబంధించి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

బాండెడ్ లేబర్‌పై అవగాహన

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణంలోని డీఎల్ఎస్ఏ భవనంలో శుక్రవారం బాండెడ్ లేబర్ సిస్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు. లేబర్ అధికారులు, రోప్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మొగిలయ్యశెట్టి సంస్మరణ సభ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయం విద్యాసంస్థల్లో విశ్రాంత లెక్చరర్, వరసిద్ధి కళాక్షేత్రం వ్యవస్థాపకుడు మొగిలయ్యశెట్టి సంస్మరణ సభ శనివారం నిర్వహించనున్నారు. సంస్థ పీఆర్వో చంద్రశేఖర్(బొట్టు స్వామి) తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గుడిపాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి తహసీల్దార్‌గా జయంతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెను టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు గుర్రప్ప నాయుడు, అరుణ్, జయచంద్ర గౌడ్, రవి నాయుడు, రఘునాథ నాయుడు, జయదేవ నాయుడు, శేఖర్ తదితరులు సన్మానించారు.

ఆరోగ్య క్యాలెండర్ ఆవిష్కరణ

గుడిపాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో శివరాజన్, గుడిపాల, బొమ్మసముద్రం వైద్యాధికారులు సంధ్య, చంద్ర మహేష్, అనూష ఆధ్వర్యంలో ఆరోగ్య క్యాలెండర్, వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంఈవో గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పేడదిబ్బల తొలగింపు

యాదమరి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోణాపల్లె పంచాయతీలో రోడ్డు పక్కన పేడ దిబ్బలను శుక్రవారం తొలగించారు. పనులను ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వైసీపీ మండల అధ్యక్షుల నియామకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, పాలసముద్రం, పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాల వైసీపీ నూతన అధ్యక్షులను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. అయితే ఈ కొత్త జాబితాలో అన్నీ పాత ముఖాలే. అంటే గతంలో ఉన్నవారినే కొనసాగించారు. వెదురుకుప్పానికి కామసాని పద్మనాభరెడ్డి, కార్వేటినగరానికి శేఖర్‌రాజు, గంగాధరనెల్లూరుకు పూర్ణచంద్రారెడ్డి, పాలసముద్రానికి తులసీ యాదవ్, పెనుమూరుకు కామసాని విజయకుమార్‌రెడ్డి, ఎస్ఆర్‌పురానికి మణి నియమితులయ్యారు.

విజయపురం: మండల వైసీపీ అధ్యక్షుడిగా విజయపురానికి చెందిన శివరాజు నియమితులయ్యారు.